ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 27.0

వైసీపీ హయాంలో నిలిచిన నిర్మాణాలకు మోక్షం
5

బాబు మార్క్ మంత్రులెవరో ?

• నేడే విడుదల

సామాజిక వర్గాల వారీగా ప్రాధాన్యత

- కొత్త ముఖాలకు ఛాన్స్ ఇవ్వబోతున్నారా ?
- ఈసారి ఇద్దరితో సరిపెట్టడానికే సిద్ధమా ?
- హ్యాట్రిక్ వీరుడు నిమ్మలకే ఛాన్స్

కూటమి ప్రభుత్వంలో అమాత్యులెవరో ? కొత్త ముఖాలకు అవకాశం ఇస్తారా ? లేక సీనియర్లకే పట్టం కడతారా ? హ్యాట్రిక్ సాధించిన వారికి తొలి ప్రయారిటీ ఇస్తారా ? తొలిసారి ఎన్నికై భారీ మెజార్టీ సాధించిన వారిని అందలం ఎక్కిస్తారా ? ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రుల ఎంపిక ఎలా ఉండబోతోంది ? అనే ప్రశ్నలకు కొన్ని గంటల్లో స్పష్టత రానుంది. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో మంత్రుల ఎంపికపైనే ఇపుడు చర్చ నడుస్తోంది

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

గత చంద్రబాబు మంత్రి వర్గాల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎస్సీ, బీసీ, క్షత్రియులకు ఎక్కువసార్లు అవకాశం దక్కింది. 2014 ఎన్నికల్లో ఎస్సీ సామాజిక వర్గం నుంచి అటు పీతల సుజాత, ఇటు జవహర్, మరోవైపు పితాని సత్యనారాయణలకు మంత్రి వర్గాల్లో చోటు దక్కింది. కాపు సామాజిక వర్గానికి ఇవ్వాలని భావించినా పొరుగునవున్న తూర్పు నుంచి అవకాశం ఇస్తున్నాం కాబట్టి ఇక్కడ ఆయా సామాజికవర్గాలు కాకుండా భిన్న సామాజిక వర్గాలకు చోటు ఇచ్చారు. ఈసారి చంద్రబాబు వినూత్న పాలన సాగించనున్నందున దానికి తగ్గట్టు మంత్రుల ఎంపిక ఉండబోతుంది. గతంలో మాదిరి కాకుండా సత్తా ఉన్న వారినే మంత్రులుగా తీసుకోవాలని, ఆ దిశగానే తుది కసరత్తుకు దిగారు. ఉమ్మడి పశ్చిమలో కూటమికి తిరుగులేని ఆధిక్యతతో గెలవడం ఈసారి అత్యంత విశేషం. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లావారీగా అన్ని కోణాల్లోనూ పరిశీలించి ఎంపిక చేయబోతున్నారు. వివిధ సామాజిక వర్గాల సిఫార్సులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదన్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈసారి మంత్రివర్గంలో బీసీ వర్గాల తరపున పొలిట్ బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణకు, కాపు సామాజిక వర్గం నుంచి నిమ్మల రామానాయుడికి, క్షత్రియ సామాజికవర్గం నుంచి రఘురామకృష్ణరాజుకు చోటు కల్పించబోతున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. గతంలో కాసంత తక్కువ మెజార్టీతో గెలవడం, తక్కువ సీట్లలోనే మంత్రులను ఎంపిక చేయాల్సి రావడం, పెద్ద కష్టమయ్యే విషయంగా ఉండేది కాదు. ఈ సారి ఏకపక్షంగా ఓటర్లు తీర్పును ఇవ్వడం, కొత్త ప్రభుత్వంపై ఎక్కువ ఆశలు పెంచుకోవడం తగ్గట్లుగానే మంత్రుల ఎంపిక దగ్గర నుంచి, సాధారణ పాలన వరకు అన్నింటిని బేరీజు వేసుకున్న తర్వాతే ముందడుగు వేసే దిశగా చంద్రబాబు అతిపెద్ద కసరత్తు చేసినట్టు చెబుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గాల నుంచి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేరు వినిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఎస్సీ సామాజిక వర్గాలకు ఇదే జిల్లా నుంచి మంత్రులుగా ఎంపిక చేస్తూ వచ్చారు. ఈసారి కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తారా? లేదా? అనేది మంగళవారం తేలిపోనుంది. ఇంకోవైపు కేంద్ర మంత్రి వర్గంలో నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో ఇదే జిల్లాలో ఆయన సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పిస్తారా ? లేదా ? అన్నది కొందరు వాదిస్తున్నారు. రాజకీయ అంచనాలకు లోబడే చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకుంటారని, కేంద్ర మంత్రులతో రాష్ట్ర మంత్రి వర్గంతో ఏ మాత్రం ముడిపెట్టడం తగదన్నది ఇంకొందరి వాదన. రకరకాల రాజకీయ పరిణామాల క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి కేవలం ఇద్దరికి మాత్రమే అవకాశం దక్కడం ఖాయమనే వాదనా వుంది.


సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, అంతకు ముందు లోకేశ్‌ను కలిసి అభినందించారు.


ఆకివీడు దత్తక్షేత్రంలో దత్తాత్రేయుడిని దర్శించి, పూజలు, హోమాలు, పూర్ణాహుతి చేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

మంత్రి రేసులో పత్సమట్ల



• నిడమర్రు జూన్ 10 : రాష్ట్ర మంత్రి వర్గ జాబితాలో స్థానం సంపాదించేందుకు ఉంగుటూరు జనసేన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జనసేన తరపున ఆరుగురికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే ఒక ఎస్సీ, రెండు బీసీ, మూడు ఓసీ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు దక్కవచ్చు. మూడు ఓసీ మంత్రి వర్గ స్థానాలలో రెండు కాపు సామాజిక వర్గానికి, ఒకటి క్షత్రియ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంది. మంత్రివర్గ విస్తరణకు ముందు పార్టీ ఎమ్మెల్యేలతో మంగళవారం జనసేనాని పవన్ కల్యాణ్ ప్రత్యేక భేటీ నిర్వహిస్తున్నారు. తమ పార్టీ తరపున ఎంత మందికి మంత్రి వర్గంలో చోటు కల్పించే అవకాశం వుందో స్పష్టత రానుంది.

లోకేశ్, పవన్ కంటే నిమ్మలకే ఆధిక్యత



జిల్లా నుంచి మూడోసారి వరుసగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడి పేరు మంత్రుల జాబితాలో తొలివరుసలో ఉండబోతున్నట్టు ప్రచారం ఊపందుకుంది. గడిచిన రెండు విడతల్లోనూ నిమ్మల తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సాధించడంతోపాటు పార్టీ ఆశించినట్లు ఓ సామాన్య కార్యకర్తగా జనాల్లో ఎదగడం, పార్టీ లక్ష్యాలను పక్కన పెట్టకుండా కష్టపడడం ఆయన విజయానికి దారితీసిన అంశాల్లో ప్రధానమైనవి. ఉమ్మడి జిల్లాలో జనం మధ్యే ఉన్న ఏకైక ఎమ్మెల్యే నిమ్మల మాత్రమే. ఆయనకు పాలకొల్లులో 70 శాతానికిపైగా ఓట్లు దక్కాయి. టీడీపీ మొత్తం మీద ఈస్థాయిలో మరెవరూ లేరు. నెల్లూరు సిటీ నుంచి ఎన్నికైన మాజీ మంత్రి నారాయణకు 68.68 శాతం, మూడోస్థానంలో రాజమండ్రి సిటీ నుంచి ఆదిరెడ్డి వాసుకు 67.68, నాలుగో స్థానంలో గాజువాక నుంచి శ్రీనివాసరావుకు 67.28, ఐదో స్థానంలో తణుకు నుంచి ఆరిమిల్లి రాధాకృష్ణకు 66.51, ఆ తర్వాత వరుసగా మంగళగిరిలో నారా లోకేశ్‌కు 66.07, కాకినాడ రూరల్‌లో పంతం నానాజీకి 65.11 శాతం, పెందుర్తి నుంచి పంచకర్ల రమేష్‌కు 65 శాతం దక్కింది. ఆఖరికి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు 64.87 శాతం, విజయవాడ నుంచి బొండా ఉమకు 63.59 శాతం, భీమిలి నుంచి ఘంటా శ్రీనివాస్‌కు 63.33 శాతం లభించాయి. ఈ లెక్కల పరంపరను ఆయన అభిమానులంతా ప్రచారం చేశారు. నిమ్మలకున్న ముక్కుసూటి వ్యవహారం, జనం మధ్య గడపడమే కారణంగా 70 శాతం ఓట్లు ఆయన దక్కించుకున్నారు. వీటిని తెలుగుదేశం అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంది. లోకేశ్, పవన్‌కంటే మించిన ఓట్ల శాతాన్ని కైవశం చేసుకున్న రామానాయుడు అన్ని విధాలా మంత్రిగా అర్హుడని తేల్చి ఆ దిశగానే నిర్ణయాలకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రత్యేకించి కాపు సామాజిక వర్గానికి చెందిన కోటాలోనే కాకుండా పార్టీ పరంగా ఆయన అటు ప్రజల్లోనూ, చట్టసభల్లోనూ పోషించిన పాత్రను పదేపదే చర్చకు వస్తున్నాయి.

ఉక్కు మనిషి

- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మ
- విశాఖ ఉక్కు పరిశ్రమతోపాటు, జిల్లాకు ప్రయోజనాలెన్నో..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్ర మోదీ తన మంత్రి వర్గంలో నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రిగా నియమించారు. ఈ నియామకంపై జిల్లావాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంతోపాటు, జిల్లా అభివృద్ధికి ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు. పశ్చిమలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేవు. ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకులోనే కొద్దిపాటి పరిశ్రమలున్నాయి. విదేశాలకు ఎగుమతులు చేసే లేసు పరిశ్రమ నర్సాపురం ప్రాంతంలో గతంలో మంచి జోష్ మీద ఉండేది. ఇప్పుడది పతనమైంది. లేసు పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు రావాలంటే కేంద్ర సహకారం అవసరం. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో పంటలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లకు ప్రయోజనకరంగా ఉంటాయి. డెల్టాలో ఆక్వా రంగం అభివృద్ధి చెందింది. ఆ రంగంలోనూ మరిన్ని యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రాయితీలతో యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. విదేశాలకు ఎగుమతులు జోరందుకోనున్నాయి.

మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, పామాయిల్ పంటలకు ప్రసిద్ధి. వాణిజ్య పంటలైన మొక్కజొన్న, పామాయిల్‌కు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పే వీలు వుంటుంది. మరోవైపు సిలికాన్ పరిశ్రమల ఏర్పాటుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉన్నప్పుడు గతంలోనే ప్రణాళిక రూపొందించారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మెట్టలో సిలికాన్ పరిశ్రమలకు ఆస్కారం ఉంటుంది. ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ప్రధాని మోదీ విశాఖపట్నం-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమల ఊసే లేకుండాపోయింది. పశ్చిమలో చిన్నపాటి ప్రాజెక్ట్‌లకు నివేదికలు తయారు చేసి అధికారులు పంపినా సరే ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో జిల్లాలోనూ పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు వున్నాయి. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయమంత్రిగా వర్మ నియమితులు కావడంతో రాష్ట్రంతోపాటు, జిల్లాలోనూ పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.


ఢిల్లీలో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మను ఎమ్మెల్యే నాయకర్ సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అంతకు ముందు మరో మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతోపాటు పలువురిని కలిశారు.

విశాఖ ఉక్కు కీలకం

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. అందుకు అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. రాష్ట్రం ఏర్పాటయ్యాక కేంద్రంలో ఉక్కు శాఖ మంత్రి పదవి తొలిసారి లభించింది. దక్షిణ భారతదేశంలో తీర ప్రాంతానవున్న ఏకైక ప్రభుత్వ కర్మాగారం ఇదే. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్‌ఐఎన్ఎల్ పేరిట మార్పించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్‌లో రుణాలు లభిస్తాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాలి. దీనివల్ల మంచి జరుగుతుంది. మంత్రి మనవారే కావడం వల్ల ఇవన్నీ సులువు అవుతాయి. వైసీపీ హయాంలో ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తేనే ప్రైవేటీకరణ సాధ్యం. ఈ విషయాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రైవేటీకరణ కసరత్తును ఆపలేకపోయింది. పైగా సానుకూలత చూపింది. జిల్లాలోనూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమాలు సాగాయి. వర్మకు ఉక్కు మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించడంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిచిపోవడం తోపాటు, లాభాలబాట పట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కడపలోనూ టీడీపీ గతంలో ఉక్కు పరిశ్రమలను స్థాపించాలని భావించింది. వైసీపీ హయాంలో శంకుస్థాపన చేశారు. అయినా అమలుకు నోచుకోలేదు. అది సాకారమయ్యేందుకు అవకాశాలున్నాయి.

ఖరీఫ్ సాగు ఆరంభం

మందకొడిగా వరి నారుమళ్ళు

- జిల్లాలో ఇప్పటివరకు 45 ఎకరాల్లో నారుమళ్ళు పూర్తి
- జిల్లాలో ఖరీఫ్ వరి విస్తీర్ణం 1.93 లక్షల ఎకరాలు

ఏలూరుసిటీ, జూన్ 10 : ఖరీఫ్ వరి సాగు పనులు ప్రారంభమయ్యాయి. అయితే జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొని ఉండడంతో వరి నారుమళ్ళ పనులు మందకొడిగా సాగుతు న్నాయి. జిల్లాలో ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం 1.93 లక్షల ఎకరాలు కాగా ఈ మేరకు సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో నారుమళ్లు పోయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు జిల్లాలో 45 ఎకరాల్లో వరి నారుమళ్లు పోసినట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారుల నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో జూన్ ఆరంభం లోనే బోర్ల కింద సాగులో వరి నారుమళ్ళ పనులు ప్రారంభమవుతాయి. ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందే వచ్చాయని సంకేతాలు వచ్చినా


సానారుద్రవరంలో పంట పొలాలను దుక్కులు చేస్తున్న దృశ్యం

ఇప్పటికీ వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్నాయి. కాల్వలకు సాగు నీటి విడుదల జరిగింది. అయినా జిల్లాలో ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గక పోవడంతో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ సమ యానికే వరి నారు మళ్ల పనులలో రైతులు బిజీగా ఉండేవారు. మే నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోళ్ళు పూర్తయినా ఇంకా రైతులకు పూర్తిస్థాయిలో ధాన్యం సొమ్ములు అందలేదు. ఈ కారణంగా పెట్టుబడులు పెట్టలేక కొంత మంది రైతులు నారుమళ్ల పనులను ప్రారంభించలేదు. ఉంగుటూరు, దెందులూరు మండలాల్లో రైతులు వరి నారుమళ్ళు పోశారు. ఈనెలా ఖరు నాటికి సార్వా సాగు పనులు ముమ్మరంగా జరుగుతాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

మెట్టలో దుక్కులు

కలిదిండి, జూన్ 10 : నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు సార్వా పంటకు సన్నద్ధమవుతున్నారు. పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. విత్తనాలను సమకూర్చుకుంటున్నారు. మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. కోరుకొల్లు, సానారుద్రవరం, వెంకటాపురం, గోపాలపురం గ్రామాల్లో గరువు నేలల్లో వరి సాగు చేస్తున్నారు. మెట్ట దుక్కులు దున్ని విత్తనాలను వెదజల్లుతున్నారు. సాగునీటి కొరత ఉండటంతో వెదజల్లే పద్ధతిలో సాగుకు సమయాత్తమవుతున్నారు. జూన్ నెలాకరుకల్లా సార్వా సాగు ప్రారంభిస్తే సకాలంలో పంట చేతికి వస్తుందని రైతులు భావిస్తున్నారు.

విత్తనాలు , ఎరువులు సిద్ధం

ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలకు కొరత లేదని, ఎరువులు సిద్ధంగానే ఉంచినట్టు జిల్లా వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇప్పటికే మార్క్‌ఫెడ్ వద్ద, రైతు భరోసా కేంద్రాల వద్ద ఎరువులు సిద్ధంగానే ఉన్నాయని చెబుతు న్నారు. జిల్లాలో 11 వేల క్వింటాళ్ల వరకు పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు సరఫరా చేసినట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆ విత్తనాలను రైతులు తమ పంట పొలాల్లో వేసినట్టు చెబుతున్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ వద్ద 4,873 మెట్రిక్ టన్నులు ఎరువులు నిల్వలు ఉన్నాయని, వీటిలో 4,238 మెట్రిక్ టన్నులు యూరియా, 222 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్, 413 మెట్రిక్ టన్నులు డీఏపీ ఎరువుల బఫర్ స్టాక్ నిల్వలు ఉన్నట్టు జిల్లా వ్యవసాయశాఖ తెలిపింది.. ఇవిగాక జిల్లాలోని అన్ని మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద 1,486 టన్నుల ఎరువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారుల నివేదికలు చెబుతున్నాయి.

ఎడారిలా కొవ్వాడ రిజర్వాయర్


ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్

పోలవరం, జూన్ 10 : పోలవరం మండలంలో ఎల్ఎన్‌డీ పేట గ్రామ శివారున నిర్మించిన కొవ్వాడ రిజర్వాయర్ చుక్కనీరు లేక జలకళ తప్పి ఎడారిలా మారింది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హయాంలో నిర్మించిన ఈ కొవ్వాడ రిజర్వాయర్ గతేడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడం వల్ల, గత 20 ఏళ్లుగా పూడికతీత పనులు చేయకపోవడం వల్ల ఈ ఏడాది చుక్కనీరు లేక ఎడారిలా దర్శనమిస్తోంది. ఎల్ఎన్‌డీ పేటలో 1,630 మీటర్ల పొడవు, 22 మీటర్ల ఎత్తున మట్టికట్ట నిర్మించి 35.50 మీటర్ల పొడవునా స్పిల్‌వే నిర్మించిన రిజర్వాయర్‌లో వాస్తవానికి 28 టీఎంసీల నీటి సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ పూడికతీత లేక కేవలం 11.58 టీఎంసీల నీటి నిల్వలు కలిగి రిజర్వాయర్ ప్రధాన లక్ష్యమైన సాగు భూములు సాగు కాక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రిజర్వాయర్‌కి ఎడమ వైపున 5.50 కిలోమీటర్ల పొడవునా, కుడివైపు 10.037 పొడవునా రబీలో 7 వేల ఎకరాలు, ఖరీఫ్‌లో 11 వేల ఎకరాలు సాగులోకి వచ్చేవి. పూడికతీత లేకపోవడం, వర్షాలు లేక నీటి నిల్వలు తగ్గడమే గాక కుడి, ఎడమ కాల్వల్లో తూరలు ఏర్పాటు, కాల్వల పూడికతీతలు చేయకపోవడం వల్ల చివరి రైతు వరకూ సాగునీరందక పంట విరామం పాటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది కొవ్వాడ రిజర్వాయర్ పరిధిలో సాగయ్యే వరి, మొక్కజొన్న పంటలకు సాగు నీటి పంపిణీ లేక పోలవరం మండలంలో ఎల్ఎన్‌డీ పేట, నాగంపాలెం, ప్రగడపల్లి, గూటాల, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకపాడు, సాగిపాడు, దొండపూడి, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, భీమోలు,గంగోలు గ్రామాల పరిధిలో పంటలకు దిగుబడులు తగ్గి పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారు.


కట్టూరులో తల్లీకొడుకు మృతదేహాలు

దైవ దర్శనాలకు వెళ్లి..

గోదావరిలో మునిగి తల్లీ కొడుకు మృతి

జల్లేరువాగులో పడి యువకుడు..

5

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

పాఠశాలలు తెరవకముందే ఇవి పాటించండి : డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 10 : వేసవిసెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో డీఈవో అబ్రహం సోమవారం జిల్లాలోని ఎంఈవోలు, సమగ్రశిక్ష సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వ హించి పాఠశాలల్లో చేపట్టాల్సిన చర్యలు, పర్యవేక్షణపై ఆదేశా లిచ్చారు. సూచించిన అంశాలన్నింటినీ అన్ని పాఠశాలల హెచ్ఎంలు, వారి సహాయకులకు తెలపాలని ఆదేశించారు. పాఠశాల ప్రారంభానికి ముందుగానే అన్ని తరగతి గదులను, వంటగది, స్టోర్ రూమ్‌లను ఆయాల సహకారంతో పరిశుభ్రం చేయించాలని కోరారు. మధ్యాహ్న భోజనపథకం ఆహార పదార్థాలను తయారుచేసేందుకు వినియోగించే వంట సామగ్రిని సబ్బునీటితో కడిగి, ఎండలో ఆరబెట్టాలని ఆదేశించారు. బియ్యం, రాగిపిండి, బెల్లం స్టాకులను సరిచూసుకోవాలని, ముఖ్యంగా పాఠశాలకు సరఫరాచేసిన కోడిగుడ్లు, చిక్కీల విషయమై గమనించాలని సూచించారు. నిల్వవున్న వంట ముడిసరుకులు వినియోగించరాదన్నారు. స్కూలులోవున్న మంచినీటి ట్యాంకులను పరిశుభ్రం చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ బి.సోమశేఖర్, ఏఎంవో రెడ్డి రామారావు, సీఎంవో రవీంద్ర, ఏఎస్‌వో రమేష్, డీఈవో కార్యాలయ ఏడీలు అవధాని, షరీఫ్, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి పైపులైన్లు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సత్యసాయి పైపులైన్లకు మరమ్మతులు

- 13 మండలాలకు మంచినీటి సరఫరా బంద్

పోలవరం, జూన్ 10 : పోలవరం నుంచి తూర్పుగోదావరి జిల్లా ఏలూరు జిల్లాల్లో 17 మండలాలకు నిత్యం తాగునీటిని పంపిణీ చేసే సత్యసాయి మంచినీటి పథకం పైపులైన్లకు కన్నాపురం అడ్డరోడ్డు నుంచి దొండపూడి వెళ్ళే రోడ్డు మార్గంలో నాలుగు చోట్ల మరమ్మతులకు గురి కావడంతో సోమవారం సత్యసాయి మంచినీటి సరఫరా నిలిపివేశారు. ఆ మార్గంలో భూగర్భం లోపల నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్లు నీటి ఒత్తిడికి పలుచోట్ల పైపులైన్లు పగిలి లీకేజీలు జరుగుతున్న నేపథ్యంలో సత్యసాయి మంచినీటి పథకం నిర్వహణ చేస్తున్న కాంట్రాక్టరు టీవీవీ సత్యనారాయణ మంచినీటి సరఫరా నిలిపివేయించి పైపులైన్లు పగిలిన ప్రాంతాల్లో పైపులు కట్ చేయించి కొత్తపైపులు జతపరిచి వెల్డింగ్ పనులు చేయిస్తున్నారు. మంచినీటి సరఫరా పునరుద్ధరించడానికి రెండు రోజులు పడుతుందని సిబ్బంది తెలిపారు. ఈ కారణంగా గోపాలపురం, చింతలపూడి, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం లైన్లలో సుమారు 13 మండలాల్లో 200 గ్రామాలకు పైగా మంచినీటి సరఫరా ఆగిపోయి ప్రజానీకం తాగునీటికి ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎండల తీవ్రత తగ్గనే లేదు, ఈ సమయంలో మంచినీటి సరఫరా నిలిపివేస్తే ఆయా ప్రాంతాల ప్రజలు మంచినీటి ఇక్కట్లు తప్పవు.

ఏడాదిగా జీతాలు కోసం కార్మికుల వేదన

మరోవైపు సత్యసాయి మంచినీటి పథకంలో ఆరంభం నుంచి పనిచేస్తున్న కార్మికు లకు తరచూ జీతాల బకాయిల సమస్య వేధిస్తూనే ఉంది. గతంలో ఎల్అండ్‌టీ కంపెనీ నిర్వహణా బాధ్యతలు నిర్వహించిన నేపథ్యంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయక ఎల్అండ్‌టీ కంపెనీ సత్యసాయి కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించ కుండానే నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. జీతాలు ఇవ్వకపోయినా ఒక ఏడాది ప్రజల మంచినీటి సమస్యల కోసం ఓపికగా సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు పనిచేశారు. అయినా ప్రభుత్వం బిల్లులు చేయక పోవడంతో 2020 నుంచి 2022 వరకూ ఏడాదిపాటు జీతాల బకాయిల కోసం కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. గత కొన్నినెలల క్రితం అధికారులు కొంతమేర సమస్య పరిష్కరించి వేరే కాంట్రాక్టరుకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయితే ప్రభుత్వం బిల్లులు చేయక పోవడంతో ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న కాంట్రాక్టరు కూడా చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. గతేడాదిగా కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించడం లేదని ఆరంభం నుంచి చేస్తున్న ఉద్యోగాలు వదులుకోలేక వడ్డీలకు అప్పులు చేసి ఇల్లు గడుపుతున్నామని ప్రభుత్వం స్పందించి జీతాల బకాయిలు ఇప్పించాలని కార్మికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

జీవో 117 ఉత్తర్వులు రద్దు చేయాలి : యూటీఎఫ్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ఆటంకంగా వున్న జీవో 117 ఉత్తర్వులను రాష్ట్రంలో నూతనంగా కొలువు దీరనున్న కూటమి ప్రభుత్వం రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన ప్రభుత్వాన్ని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని, కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వంపై విద్యావ్యవస్థను బాగుచేసే బాధ్యత ఉందన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వాలను మార్చేశక్తి ఉందని మరోసారి ఈ ఎన్నికలు రుజువు చేశాయని వివరించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు షేక్ ముస్తఫా అలీ, సుభాషిణి, రంగాచారి, శ్యాంబాబు, వెంకటేశ్వరరావు, రంగమోహన్, విక్టర్, రాజు, అనురాధ, రాంబాబు, సుధారాణి, కమల్‌కుమార్, మోహన్‌రావు, దేవానందరావు, బేతాళరావు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'నీట్ యూజీ' అవకతవకలపై విచారణ జరపాలి : పీడీఎస్‌యూ

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 10 : దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాని, మహర్షి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది మే 5న జరిగిన నీట్ యూజీ పరీక్షను దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు రాయగా, ఈ పరీక్షను సక్రమంగా నిర్వహించక పోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ పరీక్ష జరిగిన కేంద్రాల్లో ఉత్తర భారతదేశంలోని ఒకే కేంద్రంలో 8 మందికి ఫస్ట్ ర్యాంకు రావడం, ఏకంగా 67 మందికి 720/720 మార్కులు రావడాన్ని గమనిస్తే మార్కుల్లో అవకతవకలు జరిగినట్టుగా భావించాల్సి వస్తోంద న్నారు. ఎన్‌టీఏ తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నీట్ యూజీ పరీక్ష ఫలితాలు ఈ నెల 14న ప్రకటించాల్సి ఉండగా, అంతకంటే ముందుగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే అంటే ఈనెల 4న హడా వుడిగా ప్రకటించడం.. అక్రమాలను కప్పి బెట్టేందు కేనని ఆరోపించారు. నీట్ యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్‌పై జరుగుతున్న ఆందోళనలకు ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ చేసిన ప్రకటన చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష 4,750 కేంద్రాల్లో నిర్వహించగా, కేవలం 6 కేంద్రాల్లో మాత్రమే సమస్యలు తలెత్తాయని చెప్పడం దుర్మా ర్గమన్నారు. పలు పరీక్షా కేంద్రాల్లో లాంగ్వేజ్, వేరే ప్రశ్నాపత్రాల పంపిణీ జరిగిందని వివరించారు.నీట్ పరీక్షను లీకేజీలకు, ప్యాకేజీలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, అదే సమయంలో పరీక్ష రాసిన అభ్యర్థులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీట్ యూజీ అవకతవకలపై విచారణ జరిపి, మరోసారి నీట్‌ను నిర్వహించి లక్షలాదిమంది విద్యార్థులకు న్యాయంచేయాలని లేని పక్షంలో పీడీఎస్‌యూ తరఫున విద్యార్థుల పక్షాన ఆందోళనా కార్యక్రమాలను చేపడతామని సంఘ నాయకులు హెచ్చరించారు.

పంచాయతీలకు మంచిరోజులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కడలి గోపాలరావు

ఏలూరు రూరల్, జూన్ 10: కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాష్ట్రంలోని గ్రామ పంచా యతీలకు పూర్వవైభవం రానున్న దని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు కడలి గోపాలరావు హర్షం ప్రకటించారు. రాష్ట్రంలో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి అధి కారంలోకి వచ్చి ఉంటే గ్రామాలు శిథిలమై పోయేవన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్ప కూలిపోయేదన్నారు. రాష్ట్రప్రజలు విజ్ఞతతో ఓటు వేయడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలో పంచాయతీలు పూర్వవైభవం సాధిస్తాయన్నారు. వైసీపీ హయాంలో సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని, నిధులను సైతం బ్యాంకు ఖాతాల నుంచి అపహరించిన చరిత్రహీనుడు జగన్ అని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు గ్రామాల్లో విలువ లేకుండా చేశాడన్నారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు సైతం వేలకోట్లు దారి మళ్ళించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థల వల్ల గ్రామ పంచాయతీ వ్యవస్థ జగన్ కారణంగా పతనమైందన్నారు. సర్పంచ్ హక్కులను సైతం కాల రాసిందని మండిపడ్డారు. పంచాయతీలు చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి దిశగా పయనించాయని, తిరిగి చంద్రబాబు సారథ్యంలో పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. వైసీపీ హయాంలో 16 సమస్యలపై పోరాటం చేశామని అయినా చలనం లేదన్నారు. సర్పంచ్‌లు జగన్‌ను ఓడించారని ప్రజలు విజ్ఞతతో ఓటువేసి కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు.

మా ఇంటిని అప్పగించండి



బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న ఇంటి యజమానులు

కాళ్ల (ఉండి), జూన్ 10: తమ ఇంటిని అద్దెకు తీసుకున్న సమయం ముగి సినా తమ భవనాన్ని ఖాళీ చేయకుండా బ్యాంక్ ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారని ఇంటి యజమానురాలు బండారు దుర్గాంబ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కాళ్లలో బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. ఆమె మాట్లాడుతూ 2014లో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి వ్యాపార కార్యకలాపాల నిమిత్తం పది సంవత్సరాలు కాలానికి అద్దెకు ఇచ్చామన్నారు. లీజు గడువు మార్చి నెలాఖరుతో ముగిసిందన్నారు. దివ్యాంగురాలిని కావడంతో అనారోగ్య కారణాలతో పైఅంతస్తు నుంచి కిందకుపైకి ఎక్కేం దుకు ఇబ్బందులు పడుతున్నానని భవనాన్ని ఖాళీ చేసి అప్పగించాలని బ్యాంక్ మేనేజరుకు అనేక సార్లు మొరపెట్టుకున్న సరైన సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు



జీలుగుమిల్లి, జూన్ 10: గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. మండలంలో లంకాలపల్లి, పి.అంకంపాలెం గ్రామాల్లో జేసీబీతో మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. అధికారులు నూతన ప్రభుత్వం ఏర్పడే లోపు శాఖా పరమైన పనులు చక్కదిద్దే పనిలో పడ్డారు.దీంతో గిరిజన గ్రామాల్లో అక్రమ మట్టి మాఫియా ఆగడాలు పెరిగాయి. కుటమి ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం ఇసుక, మట్టి అవసరాలు తీరేందుకు అనుమతులు వస్తాయని మరికొందరు వేచి చూస్తున్నారు.

ఎన్టీఆర్ పాలిటెక్నిక్ కళాశాలగా పేరు మార్పు



కలిదిండి, జూన్ 10 : ఏలూరు జిల్లా కలిదిండి మండలం వెంకటా పురంలో వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బోర్డులో వైఎస్ ఆర్ పేరును టీడీపీ నాయకులు సోమవారం తొలగించారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలకు వైఎస్ఆర్ పేరు అనధికారికంగా పెట్టారన్నారు. కూటమి అధికారంలోకి రావడంతో ఆ పేరును తొలగించి ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలగా బోర్డు ఏర్పాటు చేశామన్నారు. శిలాఫలకాలు ధ్వంసం చేశామని వార్తలు వెలువడడం అవాస్తవమన్నారు. టీడీపీ నాయకులు కొలా శ్రీకాంత్, గూడవల్లి శ్రీనివాసరావు, దాసరి బెనర్జీ, సానబోయిన విష్ణుమూర్తి, గూడపాటి శివరామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, కురేళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ భవనాలకు ఇక..మోక్షం ?

వైసీపీ హయాంలో నిలిచిపోయిన నిర్మాణాలు

తాడేపల్లిగూడెంలో మధ్యలోనే ఆగిన పనులు

కొత్త ప్రభుత్వంలో ముందుకు వెళతాయని స్థానికుల అభిప్రాయం

సొంత నిధులతోనే అగ్నిమాపక కేంద్రం



మధ్యలో వదిలేసిన తహసీల్దార్ కార్యాలయం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 10: తాడేపల్లిగూడెంలో గత ఎన్నికల ముందు మధ్యలో నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి పనులకు మోక్షం కలగనున్నది. ఐదేళ్ల క్రితం ఏ స్థాయిలో ఉన్నాయో ఆ భవనాలు నేటికీ అలానే ఉన్నాయి. అవి బూత్ బంగ్లాలుగా మారాయి. తాడేపల్లిగూడెంలోని తహసీల్దార్ కార్యాలయం, కడకట్ల ప్రాంతం లోని స్విమ్మింగ్ పూల్, గణేష్ నగర్ వద్ద ఇండోర్ స్టేడియం సగం పనులు అయిన తరువాత మధ్యలోనే వదిలేశారు. దీంతో కొత్త ప్రభుత్వం అయినా వీటికి మోక్షం కలిగిస్తుందని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

ఇరుకు గదిలో రెవెన్యూ సేవలు

బ్రిటిష్ హయాంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గత టీడీపీ హయాంలో రూ. కోటితో నూతన భవన నిర్మాణానికి అప్పటి మంత్రి పైడికొండల మాణిక్యాలరావు నిధులు తీసుకొచ్చి శంకుస్థాపన చేయడంతో పాటు సగానికి పైగా పనులు పూర్తిచేశారు. తరువాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. దీంతో టీడీపీ హయాంలోనే రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్మించిన డేటా సెంటర్‌లోనే ఐదేళ్లుగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. మధ్యలో తాడేపల్లిగూడేనికి ఆర్డీవో కార్యాలయం మంజూరు కాగా ఆ కార్యాలయం కూడా కొన్నాళ్లు అదే కార్యాలయంలో పనిచేసింది. ఇంత ఇబ్బంది పడుతున్నా పాలకులు ఈ కార్యాలయం వైపు కన్నెత్తికూడా చూడలేదు. దీంతో ఏళ్ల తరబడి ఇరుకు గదిలోనే సేవలందించారు.



స్విమ్మింగ్ పూల్ పరిస్థితి ఇది

స్విమ్మింగ్‌పూల్ చుట్టూ తుప్పలు

తాడేపల్లిగూడెం పట్టణంకు చేర్చి కాలువ వెళ్తున్నా ఆ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లి చాలామంది యువకులు మృత్యువాత పడుతున్నారని టీడీపీ ప్రభుత్వంలో రూ.1.30 కోట్లతో కడకట్ల ప్రాంతంలో సుందరంగా స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించి పనులు చేపట్టగా ఆ పనులు కూడా జగన్ సర్కార్ పట్టించు కోలేదు. ఫలితంగా ఐదేళ్లుగా స్విమ్మింగ్‌పూల్ చుట్టూ తుప్పలు, పాములు చేరుతున్నాయి. ఎన్నికల ముందు ఎలా అయితే ఉందో నేటికీ ఆ భవనం అలానే ఉంది.

ముందుకు సాగని ఇండోర్ స్టేడియం



నిలిచిన ఇండోర్ స్టేడియం

తాడేపల్లిగూడెంలో ఏళ్ల తరబడి యువత, ప్రజలకు స్టేడియంగా ఉపయోగ పడిన విమానాశ్రయ రన్‌వే ప్రాంతంలో ఏపీ నిట్ నిర్మించడంతో యువత ఆడు కునేందుకు సరైన ఆట స్థలం లేదని భావించి టీడీపీ హయాంలో అప్పటి నాయకులు ముందు చూపుతో రూ.2 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే స్టేడియం పనులు చేపట్టకుండా వదిలేశారు. పట్టణంలో యువతకు ఆడుకునేందుకు ఆట స్థలాలే లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు దీన్ని వ్యాపార మార్గాలుగా మలచుకుని ఖాళీ స్థలాల్లో నెట్ స్టేడియాలు ఏర్పాటు చేసి గంటకు రూ.500 నుంచి 800 వరకూ వసూలు చేస్తూ క్యాష్ చేసుకుంటున్నారు.

సొంత నిధులతోనే అగ్నిమాపక కేంద్రం

ప్రమాదాలు సంభవించినప్పుడు, ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు సేవలం దించే అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి కూడా రూ.70 లక్షలతో పనులు చేపడితే ఆ పనులు కూడా చేయలేదు. దీంతో ఆ కార్యాలయం ఆర్అండ్‌బీ భవనాల వద్ద ఓ మూల ఏర్పాటు చేసుకుని సేవలందించారు. అయితే ఆర్అండ్‌బీ ప్రాంతంలో తరచూ అగ్నిమాపక వాహనం వల్ల ఇబ్బందులు వస్తుండటంతో విసిగిన అగ్నిమాపక అధికారి రామారావు ఉన్నతాధికారులకు తమ పరిస్థితి మొరపెట్టుకోగా రీజియన్‌లో అగ్నిమాపక కేంద్రానికి ఉన్న నిధులు ఈ నిర్మాణానికి మళ్లించి అగ్నిమాపక కేంద్రాన్ని పూర్తి చేసుకున్నారు.

కక్షతో ఏం సాధించారు..

కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజలకు ఉపయోగ పడే నిర్మాణాలు చేపట్టిన ఏ ప్రభుత్వం అయినా వాటి అవసరం, ఉపయోగం గుర్తించి తరు వాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగిస్తే ప్రజాధనం వృధాకాదు. ప్రజలు వాటి ఫలాలు అందుకుంటారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఏ పనినీ కనీసం కన్నెత్తి చూడకపోవడంతో కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అయిందనూ విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.



కోతకు గురైన గట్టు వెంబడి వేసిన రాళ్లు.. కుంగిన ఏటిగట్టుకు తాత్కాలికంగా వేసిన అడ్డుకట్ట (ఫైల్ ఫొటో)

గట్టు ఓకేనా..?

నరసాపురం ప్రజల్లో వీడని భయం

230 మీటర్ల మేర పూర్తయిన పనులు

ఇంకా 170 మీటర్లు పెండింగ్

వరదొచ్చినా డోకా లేదంటున్న అధికారులు

నరసాపురం, జూన్ 10 : వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.27 కోట్లతో చేపట్టిన నరసాపురం ఏటిగట్టు పనుల్లో డొల్లతనం నాలుగుసార్లు బయట పడింది. 230 మీటర్ల గట్టు పటిష్ట పనులు పూర్త వగా, ఇంకా 170 మీటర్లు పెండింగ్‌లో ఉన్నాయి. వరద వచ్చినా గట్టుకు డోకా లేదని అధికారులు చెబుతున్నా, ప్రజల్లో మాత్రం భయం వీడడం లేదు. వేసిన రాళ్లు నాసి రకంగా ఉన్నాయని, వరద వస్తే ఏమవుతుందోనని ఆందోళన నెలకొంది. 2021 జూలైలో గోదావరికి భారీ వరదలు రావడంతో అమరేశ్వరస్వామి ఆలయం వద్ద ఏటిగట్టు కోతకు గురైంది. 400 మీటర్ల గట్టు కుంగిపోయింది. వరద తగ్గే వరకు ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడిపారు. రూ.50 లక్షలతో తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఆ తర్వాత 2022 నవంబర్‌లో సీఎం జగన్ నరసాపురం పర్యటనలో రూ.27 కోట్లతో గట్టు పటిష్ట పనులకు శంకుస్థాపన చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఈ పనులను ప్రారంభించారు. కోతకు గురైన ప్రాంతంలో రాళ్లను వేసి సుమారు వంద మీటర్ల మేర పటిష్ట పనులు చేపట్టారు. ఈ పనుల్లో నాసి రకం రాళ్ల వినియోగిస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అప్పట్లో ఆరోపణలు చేశారు. దీనిని అధికార పార్టీ నేతలు కొట్టిపారేశారు. కానీ, నెల రోజుల్లోనే చేసిన పనులన్నీ గోదావరి పాలయ్యాయి. చిన్నపాటి నీటి ప్రవాహానికే గట్టు కుంగిపోయింది. ఇలా నాలుగుసార్లు, చేస్తున్న పనులన్నీ నీటి పాలవడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.ఈ నేపథ్యంలో జిల్లా పర్యటనకు విచ్చేసిన చంద్రబాబు ఈ పనుల్లో జరుగుతున్న డొల్లతనంపై గళం విప్పారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బండారు రాష్ట్ర గవర్నర్‌తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. రూ.27 కోట్లతో చేస్తున్న ఈ పనుల్లో అధికార పార్టీకి చెందిన నేతలు బినామీ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల బృందం ఈ పనులను పరిశీలించి అంతా ఓకేనంటూ సర్టిఫికెట్ ఇచ్చారు. వాడిన రాళ్లల్లో నాసి రకం లేవని తేల్చేశారు. పనులన్ని నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయంటూ ధ్రువీకరించారు. ఆ నిపుణుల బృందం ఇచ్చిన సూచనల ప్రకారం అధికారులు పనులు చేపట్టారు. ఇప్పటి వరకు కోతకు గురైన 400 మీటర్లలో 230 మీటర్ల మేర పనులను పూర్తిచేశారు. ఐదు నెలల నుంచి ఎక్కడా కోతకు గురవ్వలేదు. దీంతో ఇక గట్టుకు డోకా లేదని అధికారులు చెబుతున్నారు. పెండింగ్‌లో వున్న 170 మీటర్లు ఇదే రీతిలో పూర్తి చేస్తామంటున్నారు.

ప్రజల్లో వీడని భయం

నాలుగుసార్లు కళ్ల ముందు చేసిన పనులు నీటిపాలవడాన్ని చూసిన ప్రజల్లో ఇంకా భయం వీడటం లేదు. గోదావరికి వరదొస్తే కానీ గట్టు బలం ఎంతో బయట పడుతుందని అంటున్నారు. గతంలో ఇదే తరహాలో పనులు చేశారు. అయితే అవి నిలబడలేదు. కొద్దిపాటి ప్రవాహానికే నీటిపాలయ్యాయి. మరో రెండు మూడు నెలల్లో గోదావరికి వరదలు వస్తాయి. ఆ వరదకు గోదారమ్మ దయవల్ల ఏమి కాకపోతే భయపడనవసరం లేదు.

ఆందోళన అవసరం లేదు

సాధారణంగా ఏటిగట్టు పనులు చేసేటప్పుడు గట్టు జారడం పరిపాటి. ఆ విధంగా నాలుగుసార్లు జారింది.ఆ ప్రాంతంలో లోతు ఎక్కువ. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇక్కడ 60 మీటర్ల మేర రాళ్లు వేసి పటిష్ట పరిచాం. దీనిపై గట్టు నిర్మాణం చేపట్టాం. వరదొచ్చినా ఎలాంటి ప్రమాదం ఉండదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- సుబ్బారావు, ఏటిగట్ల అభివృద్ధి శాఖ ఏఈ



మద్ది ఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

మద్ది హుండీ ఆదాయం రూ.52.63 లక్షలు

బుట్టాయగూడెం, జూన్ 10: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. 86 రోజులకు 52,63,285 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. బంగారు వస్తువులు 21 గ్రాములు, వెండి 2.495 కేజీలు వచ్చినట్లు తెలిపారు.



ప్రగడవరం సచివాలయం-2ను సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలి

చింతలపూడి/లింగపాలెం జూన్ 10: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. సోమవారం లింగపాలెం మండలం కె.గోకవరం పీహెచ్‌సీ పరిధిలో గల ప్రగడవరం-2 సచివాలయాన్ని సందర్శించి జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ప్రధానంగా బాలింతలకు, గర్భిణులకు సుఖ ప్రసవానికి మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా గణాంక అధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. రక్తహీనత రాకుండా చేపడుతున్న చర్యలు సమీక్షించారు. పిల్లలకు ఇచ్చే వ్యాధినిరోధక టీకాలు, చిరువ్యాధుల చికిత్సలు, అంటువ్యాధులపై సమీక్షించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో పి.శ్రీనివాసరావు, జ్యోతి, సురేష్, భరత్, వెంకట్, స్థానిక సూపర్‌వైజర్ ఎస్‌కె అబ్రార్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య



పెదవేగి, జూన్ 10 : మద్యానికి బానిసై సమయానికి ఇంటికి రాకుండా తిరుగుతున్న కుమారుడిని తల్లి మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగికి చెందిన బోట్ల రామారావు న్యాయంపల్లిలో ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తూ వేళకు ఇంటికి రాకుండా తిరుగుతున్నాడు. ఆదివారం కూడా ఇదే విధంగా మద్యం తాగి రాత్రి 11 గంటలు దాటిన తరువాత ఇంటికి వచ్చాడు. దీంతో అతని తల్లి మందలించింది. "మీనాన్న చనిపోయాడు. నువ్వేమో మద్యానికి బానిసై ఇలా తిరుగుతున్నావంటూ తల్లి వెంకటేశ్వరమ్మ మందలించంతో మనస్తాపానికి గురైన రామారావు ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం పామాయిల్ ఫ్యాక్టరీ సమీపంలో పొలంలో చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి



పెనుగొండ, జూన్ 10: రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన పెనుగొండ మండలం దొంగరావిపాలెం జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన వీరవల్లి వెంకటపతి (75) కత్తిపీటలు అమ్ముతూ ఉంటారు.వ్యాపారం నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెలుతుండగా దొంగ రావిపాలెం వద్ద జాతీయ రహదారి దాటు తుండగా పెరవలి వైపు నుంచి రావులపాలెం వైపు వెలుతున్న కారు వేగంగా ఢీ కొట్టడంతో వెంకటాపతికి తలకు బలమైన గాయం అయ్యిందన్నారు. హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నకట్టు పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాణి తెలిపారు. మృతు నికి భార్య , కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఉంగుటూరు, జూన్ 10 : ఉంగుటూరు మండలం కైకరంలో కుటుంబ కలహాల కారణంగా పోతురాజుల శిరీష (24) పురుగుల మందు తాగగా ఆదివారం రాత్రి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గత నెల 22వ తేదీన పురుగుల మందు తాగగా ఆమెను తణుకు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.కోలుకున్న ఆమెను భర్త శాంతరాజు, కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. అయితే మరలా అస్వస్థతకు గురవడంతో ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది.ఆమెకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. శిరీష కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

దైవ దర్శనాలకు వెళ్లి..

గోదావరిలో మునిగి తల్లీ కొడుకు మృతి

జల్లేరువాగులో పడి యువకుడు..



తల్లి, కొడుకుల మృతదేహాలు



నాగమణి, శ్రీనివాస్ (ఫైల్)

వేలేరుపాడు, జూన్ 10 : ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని కట్కూరు శైవక్షేత్రంలోని శివుని దర్శనానికి సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర అశ్వారావుపేట చిన్నంశెట్టి బజారుకు చెందిన పది మంది కుటుంబ సభ్యులు వచ్చారు. సమీపంలోని గోదావరి నదిలో స్నానం చేసిన అనంతరం దైవదర్శనం చేసుకోవాలని గోదావరిలోకి దాగారు. ఈ క్రమంలో అల్లంశెట్టి నాగమణి (45),ఆమె కుమారుడు తేజా శ్రీనివాస్ (23) ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. వీరిని రక్షించేందుకు నాగమణి భర్త, ఇతర బంధువులు ప్రయత్నాలు చేసినప్పటికి అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో క్షణాల్లోనే నదిలో మునిగి గల్లంతయ్యారు. ఈ విషయాన్ని బంధువులు కట్కూరు గ్రామస్థులకు తెలపడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని నదిలో గాలించినప్పటికి గల్లంతైనవారి ఆచూకీ లభించలేదు.సమాచారం అందుకున్న వేలేరుపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీహరి తమ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్థానికంగా ఉన్న చేపల బోట్లు, గజ ఈతగాళ్ళతో నదిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాలను జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. తల్లి, కుమారుడు మృతితో బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. నాగమణి దంపతులు అశ్వారావుపేటలో జ్యూస్ బండి నిర్వహి స్తుండగా కుమారుడు శ్రీనివాస్ స్థానిక ఓ దుకాణంలో పని చేస్తున్నాడు.

జల్లేరులో గల్లంతైన యువకుడి మృతి



కదారి సాయికుమార్ మృతదేహం.. సాయికుమార్ (ఫైల్ ఫొటో)

బుట్టాయగూడెం, జూన్ 10 : బుట్టాయగూడెం మండలం జల్లేరు జలాశయంలో కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన కదారి దుర్గా సాయికుమార్ ఆదివారం చీకటిపడిన తర్వాత గల్లంతవగా అతని మృతదేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు బయటకు తీశారు. దుర్గాసాయి కుమార్ ఏడుగురు స్నేహితులతో కలిసి ఆదివారం గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లాడు. దర్శనం తర్వాత ఇంటికి వెళుతూ దొరమామిడి డ్యామ్‌లో స్నానం చేయడానికి జలాశయంలోకి దిగాడు. ఈత రాకపోవడంతో జలాశయంలో గల్లంతయ్యాడు. చీకటి పడేవరకు స్నేహితులు ప్రయత్నాలు చేసినా ఆచూకీ లభించ లేదు. దీంతో మృతుని తండ్రికి సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికితీశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. హెచ్‌సీ జి.కృష్ణంరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలేకరిపై దాడి చేసిన సర్పంచ్‌పై కేసు నమోదు

ద్వారకాతిరుమల, జూన్ 10: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు చేస్తున్న దాడిని చిత్రీకరిస్తున్న విలేఖరిపై దాడి చేసిన సర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈనెల 4న ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన కొందరు దాడి చేశారు.ఈ దాడిని స్థానిక పత్రికా విలేకరి బ్రహ్మయ్య తన సెల్‌ఫోన్ ద్వారా వీడియో తీస్తుండగా సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు ఫోన్ లాక్కుని విసిరేశాడు. అంతేకాకుండా ఖాళీ కూల్‌డ్రింక్ సీసాతో దాడి చేశాడు. తలపై గాయం అవడంతో అతడిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకు వెళ్లి ప్రాథమిక చికిత్స అదించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైతులకు సత్వర సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బాషా

జిల్లా వ్యవసాయాధికారి

బుట్టాయగూడెం, జూన్ 10: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి సత్వర సేవలందించాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. బుట్టాయగూడెం రైతు భరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై ఇస్తున్న విత్తనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 11 వేల టన్నుల విత్తనాలను రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. 6 టన్నులు జీలుగ, రెండున్నర టన్నులు జనుము, రెండున్నర టన్నులు పిల్లిపెసర విత్తనాలు ఉన్నాయన్నారు. డెల్టా, మెట్ట ప్రాంత రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇస్తుండగా ఏజెన్సీ ప్రాంత రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలను అందజేస్తున్నామన్నారు. జిల్లాలో 18 వేల టన్నుల వరి విత్తనాలు లక్ష్యం కాగా 22 వేల టన్నుల వరకు ఇచ్చామన్నారు. జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో వరిసాగు అవుతుండగా 60 నుంచి 70 వేల ఎకరాలకు విత్తనాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీ బుజ్జిబాబు, ఏవో ముత్యాలరావు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు మెరుగైన సేవలందించండి : మేయర్



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న మేయర్

ఏలూరు టూటౌన్, జూన్ 10: నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వార్డు సచివాలయ వ్యవస్థలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల బాధ్యత ఎంతో కీలకమన్నారు. లబ్ధిదారులకు సరైన సమయంలో పథకాలు అందించాలన్నారు. ప్రభుత్వానికి రావల్సిన ఆదాయాన్ని వసూలు చేయాలన్నారు. అడ్మినిస్ట్రేటీవ్ సెక్రటరీలు ప్రతీరోజు ఫీల్డ్‌వర్కు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ కమీషనర్ ఎస్.రాధ, సెక్రటరీ దివ్యకుమారి పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు నిర్వహించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న లేఖరులు

కామవరపుకోట, జూన్ 10: రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాత పద్ధతిలోనే భూముల రిజిస్ట్రేషన్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లాలని దస్తావేజు లేఖరుల సంఘం మండల అధ్యక్షుడు నల్లమిల్లి రవికుమార్ అన్నారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ నాయకులు ఘంటా సత్యంబాబుకు వినతి పత్రాన్ని అందచేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 20 జీవో వలన ప్రజలు, దస్తావేజు లేఖరులు నష్టపోతున్నారన్నారు. రాజ్యాంగపరంగా వచ్చిన రిజిస్ట్రేషన్ హక్కును వైసీపీ ప్రభుత్వం మార్పు చేసిందన్నారు. ఆయన వెంట దస్తావేజు లేఖరుల సంఘ నాయకులు పజ్జూరి రాము, పెరవలి రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, రాజాజీ, దాసరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ జయంతి



రక్తదానం చేస్తున్న యువకులు

ఉంగుటూరు, జూన్ 10: దివంగత మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు పాలు రొట్టెలు పంపిణీ చేశారు. కమ్యూనిటీ హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముత్యాల బాలాజీ, యెగ్గిన ఉమ, నౌడు శ్రీకాంత్, కూనా శ్రీరాములు, పెద్దిరెడ్డి వెంకన్న, నక్కిరి పెద్దిరాజు, పాండ్రాకుల శ్రీను, సంగాబత్తుల పాండు రంగ పార్థసారథి, పీఏ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ కృషి అభినందనీయమని భీమడోలు జనసేన నాయకులు అన్నారు. వట్టి వసంతకుమార్ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు, జనసేన శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు, పౌష్టికాహారాన్ని అందించారు. మొక్కలు నాటారు. సంత మార్కెట్‌లో వట్టి వసంత కుమార్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంక్ మరమ్మతులు అనంతరం పునఃప్రారంభించారు. వర్ధినీడి సత్యసాయి, కమల రామకృష్ణ, ఘంటా నూకరాజు, బొమ్ము ప్రసాద్, సతీష్, గణేష్, దుర్గా పల్లవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



ప్రైవేటు బస్సు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 10: జిల్లాలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకూ గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. జిల్లాలో సారా, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. రాత్రివేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు.

అప్పనవీడులో దొంగతనం

పెదపాడు, జూన్ 10 : అప్పనవీడు గ్రామానికి చెందిన వట్టికూటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి వైద్యం నిమిత్తం గుడివాడలోని కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇల్లు దోచేశారు. ఎస్సై కె.శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నాగేశ్వరరావు కుటుంబం రెండు రోజుల అనంతరం తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రెండున్నర కాసుల నానుతాడు, రూ.50 వేలు నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్లవ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూన్ 10: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించి నాయుడుగూడెం వద్ద ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ వివరాలు తెలిపారు. వాహన, చెరువు యజమానులతో పాటుగా వాహన డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గంగానమ్మ ఆలయం వద్ద అన్న సమారాధనలో ఎమ్మెల్యే చంటి



చిన్న వెంకన్న ఆలయంలో బొబ్బిలి ఎమ్మెల్యే



చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్‌కు నేతల పుష్పగుచ్ఛం



పోలవరం ఎమ్మెల్యే బాలరాజును కలసిన ఉద్యోగులు

ఎమ్మెల్యేలు, కూటమి శ్రేణుల ఆలయ సందర్శన

ఏలూరు కార్పొరేషన్, జూన్ 10: నగరంలో గంగానమ్మ ఆలయ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు.

మెరకగూడెం జాతరలో చిర్రి బాలరాజు

బుట్టాయగూడెం: మెరకగూడెంలో సోమవారం జరిగిన అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. గ్రామస్తులు బాలరాజుకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మెట్ట బుచ్చిరాజు, పాదం నాగకృష్ణ, మాదేపల్లి శ్రీను, చోడెం రాజు, పూనెం రాజు, సోడెం సుధాకర్, రామకృష్ణ, సూర్య తేజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన వెంకన్న సేవలో బొబ్బిలి ఎమ్మెల్యే

ద్వారకా తిరుమల: శ్రీవారి ఆలయాన్ని విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబి నాయన) సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. ఏఈవో మెట్టపల్లి దుర్గారావు ఆయనకు శ్రీవారి చిత్రపటం అందజేశారు.

అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికైన సందర్భంగా బీజేపీ నాయకులు పలువురు సోమవారం పాదయాత్రగా ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకున్నారు. ముందుగా శ్రీవారికి మొక్కులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించారు. టీడీపీ అనపర్తి ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, స్థానిక నాయకులు మటపర్తి బద్రి, ఏపూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు 1008 కొబ్బరికాయలు

పెదవేగి: రాట్నాలమ్మకు టీడీపీ నాయకులు 1008 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్, ఎంపీగా పుట్టా మహేష్‌కుమార్ విజయం సాధించడంతో బాపిరాజుగూడేనికి చెందిన టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టారు. బొప్పన సుధాకర్, ముక్కామల శివసత్యనారాయణ, సర్పంచ్ జోగి పెదపెంటయ్య తలకొండ జమలయ్య, చలమాల ఏడుకొండలు, నరదల చినపిచ్చియ్య, జోగి పుల్లారావు, యాళ్ళ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

జన సేన నాయకుల సంబరాలు

ఏలూరు కార్పొరేషన్: ప్రధాన మంత్రిగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడంతో జనసేన కార్యాలయం వద్ద జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. మోదీ పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం జనసేన శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జన సైనికులు రేయింబవళ్ళు కష్టపడి కూటమి విజయానికి ఎనలేని కృషి చేశారని, అదే స్ఫూర్తితో ఏలూరు నగర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని అప్పలనాయుడు పిలుపునిచ్చారు. నగిరెడ్డి కాశీ నరేష్, బొత్స మధు, వీరంకి పండు, రమణ, రెడ్డి గౌరీశంకర్, సరిది రాజేష్, నిమ్మల శ్రీను, ఈశ్వరరావు, బీవీ.రాఘవయ్యచౌదరి, సిరిపల్లి ప్రసాద్, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: జనసేన విజయం పేదల విజయమని జనసేన నేత మోదుగు అంజిబాబు అన్నారు. ఆసన్నగూడెంలో జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరిపారు. పవన్‌కల్యాణ్ పిఠాపురంలో గెలువడం, కూటమి రాష్ట్రంలో గెలువడం ఎంతో శుభపరిణామం అన్నారు. అనంతరం ఆసన్నగూడెంలో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అయనతో పాటు గ్రామజనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు శుభాకాంక్షలు

దెందులూరు: కేంద్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నరసాపురం ఎంపీ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకటచైతన్య కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయం వద్ద తపన చౌదరితో కలసి శ్రీనివాసవర్మకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యే బాలరాజుకు అభినందనలు

జీలుగుమిల్లి: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును విద్యుత్ శాఖ ఉద్యోగులు సోమవారం కలసి అభినందనలు తెలిపారు. గిరిజన ప్రాంతంలో విద్యుత్ సరఫరా మెరుగుదలకు కృషి చెయ్యాలని కోరారు. జీలుగుమిల్లి, కుక్కునూరు వేలేరుపాడుకు చెందిన జెఇ డి.గౌల్, ఎల్ఐలు కన్నబాబు, సోమరాజు, లైన్‌మెన్‌లు ఎం.వెంకటేశ్వరావు, ఎం.గంగిరెడ్డి, ఎం.నాగేశ్వరావు, ఎం.కృష్ణ, శ్రీను, కృష్ణమోహన్ ఉన్నారు.

రోషన్‌కుమార్‌ను కలసిన నాయకులు, అధికారులు

చింతలపూడి: ఎమ్మెల్యేగా ఎన్నికైన సొంగా రోషన్‌కుమార్‌ను సోమవారం పలువురు నాయకులు, అధికారులు ఏలూరులోని ఆయన నివాసం వద్ద కలసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, మాటూరి వెంకటరామయ్య, ఆశీర్వాదం, దారా మహేంద్ర, ఏసు, సత్యనారాయణ ఉన్నారు. సచివాలయ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు తనిపెడ రాజా ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులు పలువురు అయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.







ఏలూరులో ఎమ్మెల్యే చంటి, ఉంగుటూరు మండలం కాగుపాడు, చింతలపూడి మండలంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

సినీ నటుడు బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు టూటౌన్, జూన్ 10: నందమూరి వారసుడిగా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి నటసింహంగా గుర్తింపు తెచ్చుకున్న నందమూరి బాలకృష్ణకు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నటుడిగా ప్రజలను అలరిస్తూ, ఎమ్మెల్యేగా ప్రజాసేవలో తరిస్తున్న బాలకృష్ణ మరోవైపు క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా సేవలందిస్తున్నారని కొనియాడారు.

నగరంలోని 25వ డివిజన్‌లో బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి గూడవల్లి శ్రీను, డివిజన్ ఇన్‌చార్జిలు కడియాల విజయలక్ష్మి, చేకూరి గణేష్, మట్టా రంజిత్, లంకలపల్లి మాణిక్యాలరావు, సోమిశెట్టి రాము, వేమూరి శ్రీధర్, కడిమి రమేష్, ఎంవీవీఎస్.శర్మ, కంభంపాటి మురళి, కనకమేడల సురేష్ పాల్గొన్నారు.

● కామవరపుకోట టీడీపీ కార్యాలయం వద్ద బాలకృష్ణ జన్మదిన వేడుకలను నందమూరి అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి ఉత్సాహాన్ని ప్రదర్శించారు.నినాదాలతో హోరెత్తించారు.

● ఉంగుటూరు: మండలంలోని కాగుపాడులో సినీ నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి అభిమానులు అభినందనలు తెలిపారు.

● చింతలపూడి: నందమూరి బాలకృష్ణ జన్మదినం వేడుకలు ఎన్టీఆర్ విగ్రహం వద్ద అభిమానులు నిర్వహించారు. తక్కెళ్ళపాటి రమేష్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సుప్రియమ్‌పేటకు చెందిన కాటూరి వెంకటేశ్వరరావుకు వీల్‌చైర్ అందజేశారు. బోడానాగభూషణం, పల్లె శ్రీను, అనిష్‌కుమార్, ఆళ్ళ రమేష్, తాటి అప్పారావు, నందిగం నాగేశ్వరరావు, కొత్తపూడి శేషగిరి, నల్లమాటి శ్రీను, తులిమెల్లి రామారావు, పలువురు అభిమానులు పాల్గొన్నారు.







దెందులూరు, టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లి, ఉంగుటూరు మండలం కాగుపాడులో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి

రామోజీరావు సేవలు మరువలేనివి

దెందులూరు, జూన్ 10: పత్రిక, సినీ, వ్యాపార రంగాల్లో రామోజీరావు సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. దెందులూరులో సోమవారం స్థానికులు రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. రామోజీ మరణం తీరని లోటన్నారు. రామోజీ నీతి నిజాయితీలతో ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రగతి విద్యా సంస్థల డైరెక్టరు ఎంఎస్ఆర్ ఆంజనేయులు (ప్రగతి రాజా), మొటపర్తి రాజా, మేడిది నికోల, దేవినేని తులసీదాసు, సంపంగి తిలక్, కొలుసు దాను, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: రామోజీరావు మృతి పత్రికారంగానికి తీరనిలోటని నల్లూరి వెంకటచలపతిరావు అన్నారు. రాజుపోతేపల్లిలో టీడీపీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చలపతిరావు మాట్లాడుతూ రామోజీరావు పారిశ్రామికవేత్తగా, పాత్రికేయునిగా ఎనలేని సేవలను అందించారన్నారు. నెక్కలపూడి రామచంద్రరావు, దావులూరి కృష్ణ, కేసిన వెంకటేశ్వరరావు, పడమటి శివ, ఉండవల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: కాగుపాడులో కడియాల రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. కడియాల రాము, బాలకృష్ణ, త్రిమూర్తులు, కొమ్మిన నాగరాజు, విడియాల చౌదరి, దుక్కా అచ్యుతరావు, పైడిముక్కుల శ్రీను, వైబోయిన ఆదియ్య, పెనుమూడి సతీష్, గోపవరపు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా



రాజీనామా పత్రం ఇస్తున్న సర్పంచ్

ఏలూరు రూరల్, జూన్ 10: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుతీరనున్న నేపథ్యంలో పలువురు సర్పంచ్‌లు, ఏఎంసీ చైర్మన్‌లు రాజీనామా చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక సర్పంచ్ జయమంగళ ప్రభావతి జిల్లా పంచాయతీ కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని అందజేశారు. 70 ఏళ్ల వయస్సులో ఆరోగ్యం సహకరించడం లేదని లేఖలో పేర్కొన్నారు. దైనందిన కార్యకలాపాల నిర్వహణ కష్టం ఉందని, ప్రతిరోజూ ఆసుపత్రికి వెళుతుండగా వైద్యులు విశ్రాంతి తీసుకోమన్నారని, కాబట్టి గుడివాకలంక గ్రామ సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరి బలవంతం కాని, ఆదేశాలతో రాజీనామా చేయడం లేదని, తన ఇష్టపూర్వకంగా రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఏలూరు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవికి నెరుసు చిరంజీవులు రాజీనామా చేశారు. ఆయన గత ఏడాది నుంచి ఏఎంసీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ఏడాది పూర్తి కావడంతో తిరిగి ఏఎంసీ చైర్మన్ పదవిని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో నెరుసు చిరంజీవులు పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.



అముక్త మాల్యద నృత్యరూపకంలో సన్నివేశం

ఆటా వేడుకల్లో ఏలూరు కళాకారుల ప్రదర్శనలు

ఏలూరు కల్చరల్, జూన్ 10: అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని అట్లాంటాలో అమెరికా తెలుగు సంఘం (ఆటా) సాంస్కృతిక సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏలూరుకు చెందిన కళారత్న కె.వి సత్యనారాయణ నృత్యకళాకారులతో గోదా కల్యాణం, కూచిపూడి నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన విశేషంగా అలరించిందని కె.వి సత్యనారాయణ తెలిపారు. ఆటా నిర్వహించిన సై అంది పాదం నృత్యపోటీలకు, శాస్త్రీయ నృత్య పోటీలకు ఆయన న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. వేలాదిమంది తెలుగువారు, తెలుగురాష్ట్రాల నుంచి కవులు, గాయకులు, నృత్య కళాకారులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారని కె.వి సత్యనారాయణ తెలిపారు.

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, జూన్ 10: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ప్రగడవల్లి, రేపల్లెవాడ, పోలవరం, చేగొండపల్లి, ఇటుకలకోట, వింజరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ గ్రామాల్లో కురిసిన వర్షానికి వీధులు జలమయమయ్యాయి. పంచాయతీలో పలుచోట్ల డ్రైనేజీలు సరిలేక నీరు నిలిచి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు. పోలవరం మెయిన్ రోడ్డులో స్థానిక చిన రామాలయం వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గ్రామాల్లో మురుగునీరు బయటకు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దూరవిద్య ప్రాక్టికల్స్ పరీక్షలకు 26మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 10: ఏపీ ఓపెన్‌స్కూల్స్ దూరవిద్య ప్రాక్టికల్స్ పరీక్షలకు సోమవారం 26 మంది గైర్హాజరైనట్లు డీఈవో అబ్రహం తెలిపారు. ఇంటర్మీడియట్ ఫిజిక్స్ పరీక్షకు 33మంది, కెమిస్ట్రీ పరీక్షకు 23 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు కార్పొరేషన్, జూన్ 10: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంబంధిత డైరెక్టర్ కె.శశిధర్ తెలిపారు. జూట్ బ్యాగ్‌ల తయారీలో మహిళలకు 13 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. యువకులకు 30 రోజులపాటు రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్ రిపేరులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేవలం గ్రామీణ ప్రాంతాల యువకులకు మాత్రమే ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయం వద్ద శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని, ఆధార్‌కార్డు జిరాక్స్, కలర్ ఫొటోలతో హాజరుకావాలని శశిధర్ పిలుపునిచ్చారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** లయన్స్ భవనంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వినికిడి యంత్రాలను జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పంపిణీ చేశారు. రత్నకుమార్, మురళీ, చలపతిరావు, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుట్టాయగూడెం హైస్కూల్ వద్ద భక్తాంజనేయస్వామి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.
- **ఉంగుటూరు :** కైకరం శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహిస్తారు. త్వరలో కమిటీ ఏర్పాటు చేయనున్నారు.
- **లింగపాలెం :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ నందిగం సత్యనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పరామర్శించారు. కలరాయనిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నందిగం సత్యనారాయణ ఇటీవల మరణించడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **కొయ్యలగూడెం :** భక్తిభావాలు పెంపొందించుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం సౌభాగ్య థియేటర్ వద్ద ఈ నెల 19న నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర బైక్‌ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు.
- **చింతలపూడి :** తెలుగుదేశం అంటే బీసీలేనని, ఈ ఎన్నికల్లో తమ సత్తాచాటారని బీసీ సాధికారత జిల్లా కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు అన్నారు. ప్రగడవరంలో బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ విజయంపై అభినందన కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం బీసీ సమాఖ్య అధ్యక్షుడిగా చిమటా తిరుపతి రావు, కార్యదర్శిగా చక్రపు మారేశ్వరరావును ఎన్నుకున్నారు. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానించారు.

ధర్నాల హోరు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

ధాన్యం బకాయిలు తక్షణం చెల్లించాలి

ఏలూరు కలెక్టరేట్, జూన్ 10: ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని కౌలురైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం సొమ్ములు ఇవ్వకపోతే సార్వా సాగుచేయలేమని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం 40 రోజులుగా ధాన్యం సొమ్ము చెల్లించకపోవడం అన్యాయం అన్నారు. జిల్లాలో దాదాపు రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. చేతిలో పెట్టుబడి సొమ్ములు లేక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. బైరెడ్డి లక్ష్మణరావు, చిన్ని పోతురాజు, వెలగలేటి మోహన్ రావు, లావేటి సోమ్‌బాబు, కానూరి రాజు, అన్నంరెడ్డి రంగారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన బకాయి విడుదల చేయాలి

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో డ్వామా పీడీ ఎ.రాముకు వినతిపత్రం అందజేశారు. పోలవరం నిర్వాసితులకు, కొల్లేరు పేదలకు అదనంగా ఉపాధి పనులు కల్పించాలని కోరారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించటం లేదని విమర్శించారు. ఉపాధి కూలీలకు పేస్లిప్ ఇవ్వడం లేదని ఆరోపించారు. పని చేసి మూడునుంచి ఆరువారాలు అవుతున్నా కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామపంచాయతీల్లో ఉన్న పేదలకు ఉపాధిపనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూటౌన్: చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఉచితంగా ప్రభుత్వం గ్యాస్ ఇవ్వాలన్నారు. మెనూ చార్జీలు రూ.20కి పెంచాలన్నారు. సంవత్సరానికి రెండు జతల చీరలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, అనురాధ, లింగరాజు, అనంతలక్ష్మి, వెంకటలక్ష్మి, వెంకటపద్మ, అంజలిదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవినీతి పై విచారణ చేయండి

ఏలూరు రూరల్: ద్వారకాతిరుమల పంచాయతీలో కోటి 20లక్షలు అవినీతి జరిగిందని, సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు అవినీతికి పాల్పడ్డారని, జనవరిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా డీపీవో చర్యలు తీసుకోవడం లేదని, తక్షణం విచారణ చేయాలని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ ఆముక్తా డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆమె ధర్నా చేపట్టారు. జనవరి 27న కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జంగారెడ్డిగూడెం డిఎల్‌పివోను విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. విచారణ వివరాలు డీపీవో చెప్పడం లేదని ఆమె మండిపడ్డారు. ఫిర్యాదు చేసి ఆరునెలలు అయినా నేటివరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.



బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన

వివాదాస్పద భూములపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌టిఆర్ 1/70 చట్టం పరిధిలోని భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన గిరిజనేతరుడు వివాదాస్పద భూముల్లో పనులు చేయడంపై అభ్యంతరం తెలిపారు. భూముల రికార్డులను పరిశీలించి చట్టాలను అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రాలు అందజేశారు.





బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నూజివీడు, భైరవపట్నం, మట్టగుంటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

ఘనంగా బాలయ్య పుట్టినరోజు వేడుకలు



కైకలూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

కైకలూరు, జూన్ 10: సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను కైకలూరులో ఘనంగా నిర్వహించారు. సోమవారం కైకలూరులో కోరుకొల్లు రోడ్డు సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు, ఎన్టీఆర్ యువసేన, బాలకృష్ణ అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యేగా వరుసగా మూడు సార్లు బాలకృష్ణ గెలుపొందారని ఎన్టీఆర్ కుటుంబాన్ని ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారనడానికి బాలకృష్ణ విజయమే నిదర్శనమన్నారు. తెలుగు మహిళ నాయకురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, పోలవరపు లక్ష్మీరాణి, టీడీపీ నాయకులు ఎండీ జాని, వీరాబత్తిన సుధా, ఎండీ ఉస్మాన్, జక్కా సత్య నారాయణ, తలారి రాజేష్, కంచర్ల రామకృష్ణ, తెంటు నాగేశ్వరరావు, డోకల శ్రీనివాసరావు, సయ్యద్ బాషీద్, ఎన్టీఆర్ యువసేన నాయకులు లక్కింశెట్టి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను నూజివీడులో ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో కేకను కట్‌చేసి టీడీపీ నాయకులు వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ వారసుడిగా సినీరంగంలో పేరు ప్రతిష్టలు తెచ్చుకున్న బాలకృష్ణ ఇటు రాజకీయాల్లోనూ తన పాత్రను పోషిస్తూ టీడీపీ అధినేత నారాచంద్రబాబుకు అండగా నిలిచారన్నారు. నూజివీడు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, పామర్తి సముద్రరాజు, చిమటా శ్రీనివాసరావు, తేనేటి కిరణ్, జొన్నలగడ్డ అశోక్, శివలక్ష్మి, బాణావతు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: భైరవపట్నం కూటమి కార్యాలయంలో బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, చాపరాల నాగేశ్వరరావు, సజ్జ సురేష్‌బాబు(బాబి), గజ్జల గణేష్, గుడివాడ గణేష్, వీరవల్లి శివయ్య, ఎలికే రాంబాబు, పిండి రామాంజనేయులు, చెన్నంశెట్టి నందకిషోర్, భరక సునీల్, గుంటూరు సత్యనారాయణ, నున్న రమేష్, రుద్రమరాజు రాజా, నారగాని శివసాయిరామ్, కోగంటి విజయ్, గోల్కొండ చంద్రశేఖర్, కట్టా గోపి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో బాలకృష్ణ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

కలిదిండి: కోరుకొల్లు, మట్టగుంట గ్రామాల్లో సోమవారం సినీ హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నున్న సుబ్రహ్మణ్యం, భట్టు లీలా కనకదుర్గ, మహేష్, అమజాల వెంకట్రావు, నల్లిబోయిన భోగేశ్వరరావు, నున్న నరసింహరావు, అంద్రాజు శ్రీనివాస్, తిరుమాని రంగారావు, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకున్నారు..

ముసునూరు, జూన్ 10: రాష్ట్రంలో కూటమి విజయం సాధించడం, నూజివీడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి గెలుపొందడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. లోపూడి టీడీపీ నాయకుడు చలమాల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు కోటగిరి రామ్మోహన్‌రావు, పొదిలి అశోక్, చలమాల గంగాధరరావుతోపాటు మరో 50 మంది టీడీపీ నాయకులు సోమవారం గుబ్బల మంగమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్ళి తమ మొక్కు తీర్చుకున్నారు. అలాగే మరో 40 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయరాయి లోని రాట్నాలమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించారు. వేల్పుచర్లకు చెందిన తెలుగు యువత ద్వారకా తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

లోకేశ్‌కు మాల్యాద్రి అభినందన



కైకలూరు, జూన్ 10: రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించడం పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిజెఎస్ మాల్యాద్రి శుభా కాంక్షలు తెలిపారు. సోమవారం మంగళగిరిలో లోకేశ్‌ను సత్కరించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవ స్థలను చక్కదిద్ది ప్రజలకు సుపరిపాలన అంది స్తామని లోకేశ్ అన్నారని మాల్యాద్రి తెలిపారు.

కేంద్రంలో మంత్రి పదవులపై హర్షం

ముదినేపల్లి, జూన్ 10 : కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ ఎంపీలు కింజరాపు రామ్మోహన నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు స్థానం కల్పించటం పట్ల పలువురు కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, నాయకులు బొప్పన సుందరరామయ్య, చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్, లింగమనేని భాను ప్రసాద్, పరసా ఏడుకొండలు, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే టీడీపీ ముదినేపల్లి మండల కమిటీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోండి

»కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశం » ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, జూన్ 10 : కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దినతేజ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం "కుక్కలు బాబోయ్.. కుక్కలు" శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన లంక గ్రామాల్లో కుక్కల గుంపులను బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కుక్కలను చంపేందుకు రైట్స్ లేకపోవటంతో సంతానోత్పత్తి నిరోధానికి వెటర్నరీ వైద్యులతో ఇంజక్షన్లు ఇవ్వాలన్నారు. కుక్క కాటు బాధితులకు పీహెచ్‌సీలో యాంటీ ర్యాబిస్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కుక్క కాటుకు గురైన వెంటనే ఇంజక్షన్ చేయించుకోవాలన్నారు. పిచ్చి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిచ్చి కుక్కలను గుర్తించి వాటిని వెంటనే నిర్మూలించాలన్నారు.



సైబర్ మోసాలకు గురి కావద్దు

చాట్రాయి, జూన్ 10: బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్, అకౌంటెంట్ భాగ్యరావు కోరారు. సోమవారం చాట్రాయి ఎస్బీఐలో జరిగిన ఖాతాదారుల సమావేశంలో వారు మాట్లాడుతూ క్రెడిట్, డెబిట్ కార్డు, ఎలక్ట్రిసిటీ బిల్స్, ఇన్‌స్టెంట్ లోన్, ఆన్‌లైన్ జాబ్స్, ఓఎల్ఎక్స్, సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ, మొదలైన వాటి ద్వారా సైబర్ నేరగాళ్ళు ఫోన్ నంబర్‌కు లింక్‌లు పంపుతున్నారని అన్నారు. ఆధార్, ఫోన్, బ్యాంకు అకౌంట్ నంబర్లు తెలుసుకొని కస్టమర్‌కు ఓటీపీ పంపి మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఖాతాదారులు సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930, ఎస్బీఐ హెల్ప్‌లైన్ నంబర్లు 18001234, 18002100ను వినియోగించుకొని సైబర్ నేరగాళ్ళ ఆట కట్టించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఖాతాదారులకు బ్రోచర్లను అందజేశారు.



పిడుగుపాటుకు 4 గేదెల మృతి

చాట్రాయి, జూన్ 10: సోమవరంలో తోటలో చెట్టుకు కట్టేసి ఉన్న పెదలంక వరలక్ష్మికి చెందిన 4 గేదెలపై సోమవారం మధ్యాహ్నం పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. వరలక్ష్మి కుటుంబ సభ్యులు తోటలో వ్యవసాయ పనులు చేసుకుంటూ గేదెలను చెట్టుకు కట్టేశారు. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం మొదలై పెద్ద శబ్దంతో చెట్టుపై పిడుగుపడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ప్రభుత్వం పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధితులు కోరారు.



వైఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బోర్డుపై రంగు వేస్తున్న దృశ్యం



ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలగా బోర్డు ఏర్పాటు

పాలిటెక్నిక్ కళాశాల పేరు మార్చేశారు..

కలిదిండి, జూన్ 10 : కలిదిండి మండలం వెంకటాపురంలో వైఎస్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బోర్డులో వైఎస్ఆర్ పేరును టీడీపీ నాయకులు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వైఎస్ఆర్ పేరు అనధికారికంగా పెట్టారన్నారు. కూటమి అధికారంలోకి రావటంతో ఆ పేరును తొలగించి ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలగా బోర్డు ఏర్పాటు చేశామన్నారు. అయితే తాము శిలాఫలకాలు కూడా ధ్వంసం చేశామని వార్తలు వెలువడడం అవాస్తవమన్నారు. టీడీపీ నాయకులు కొలా శ్రీకాంత్, గూడవల్లి శ్రీనివాసరావు, దాసరి బెనర్జీ, సానబోయిన విష్ణుమూర్తి, గూడపాటి శివరామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, కురేళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో కూటమి విజయోత్సవాలు



కలిదిండిలో..



కమ్మిలి విఠలరావు దంపతులను సత్కరిస్తున్న మహిళలు



ముదినేపల్లిలో కూటమి నేతలకు సత్కారం

కూటమి విజయోత్సవాలు

నూజివీడు టౌన్, జూన్ 10: రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం, జనసేన కూటమి అఖండ విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో నూజివీడు జనసేన నాయకులు విజయోత్సవాలను నిర్వహించారు. నూజివీడు జనసేన కార్యాలయంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి 154 సీట్లు సాధించడంతో పాటు నూజివీడులో కొలుసు పార్థసారథి విజయం సాధించటం ఆనందకరమన్నారు. జనసేనలో కొందరు కోవర్టుల వల్ల మెజార్టీ తగ్గిందని, ఆ కోవర్టుల విషయంలో జనసేన అధినాయకులకు సమాచారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు జలసూత్రం పవన్, నూజివీడు పట్టణ నాయకులు బండారు రాజు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల ఇళ్ళు అభిమానులు, కార్యకర్తలతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం కైకలూరులో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఇంటికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున కూటమి నాయకులు విచ్చేసి ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా కమ్మిలి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సునామిలా కూటమి నాయకులను ప్రజలు గెలిపించారని గత ప్రభుత్వ వైఫల్యాలతో స్థానికంగానూ రాష్ట్రంలోను ఆ పార్టీ భారి మూల్యం చెల్లించిందన్నారు. చంద్రబాబు పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

కలిదిండి: కలిదిండిలో కూటమి విజయోత్సవాలు కొనసాగుతున్నాయి. కలిదిండిలో సోమవారం జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి ఆధ్వర్యంలో కూటమి నాయకులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కామినేని విజయానికి కృషి చేసిన రమాదేవిని సత్కరించారు. కూటమి నాయకులు బోడావుల రాము, యలవర్తి వెంకటేశ్వరరావు, భట్రాజు ఏసుబాబు, బోయిన గోవింద్, వెంకటేశ్వరరావు, జాన్ రాజ్, తోట రాజారావు, సురేష్, భోగేశ్వరరావు, యలవర్తి జయరావు, చేబోయిన జయరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో కామినేని శ్రీనివాస్‌కు ఘన విజయం చేకూర్చి ముదినేపల్లి మండలంలో భారీ మెజార్టీ సాధించేందుకు కృషి చేసిన నాయకులను పలు గ్రామాల ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తుతున్నారు. మండలానికి చెందిన నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు బొర్రా చలమయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు మోటేపల్లి హనుమ తదితరులతో కలసి సోమవారం మండలంలోని మూడు పార్టీల గ్రామస్థాయి, బూత్ స్థాయి నాయకులు విజయోత్సవాలు జరుపుకున్నారు. ముదినేపల్లిలోని టీడీపీ కార్యాలయం వద్ద వినోద్‌తోపాటు పలువురు నాయకులను వివిధ గ్రామాల కూటమి కార్యకర్తలు సత్కరించారు.

14న ఆలయ భూములు కౌలుకు వేలం

ముదినేపల్లి రూరల్, జూన్ 10: వడాలిలోని జగన్నాథస్వామి ఆలయ భూముల కౌలుకు ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ రూరల్ మండలం శేరి గొల్లపల్లి గ్రామంలో ఉన్న 2.25 ఎకరాలు చేపల చెరువుకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వడాలి గ్రామంలో మాగాణి భూమి సర్వే నంబర్ 84-1లోని 1.5 ఎకరాలకు శుక్రవారం ఆయా గ్రామాల్లో కౌలు బహిరంగ వేలం జరుగుతుందని వివరించారు. పాటదారులు ముందుగా డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ముసునూరు, జూన్ 10: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. పర్యావరణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ముసునూరు ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఎంపీటీసీ చీలి లక్ష్మీతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు. ఉపాధి పథకంలో మొక్కల పెంపకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె కోరారు. ఏపీవో రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనాలకు వెళ్లి..

గోదావరిలో మునిగి తల్లీకొడుకు మృతి
జల్లేరువాగులో పడి యువకుడు



తల్లీకొడుకు మృతదేహాలు





నాగమణి, శ్రీనివాస్ (ఫైల్)

వేలేరుపాడు, జూన్ 10 : ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని కట్కూరు శైవక్షేత్రంలోని శివుని దర్శనానికి సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట చిన్నంశెట్టి బజారుకు చెందిన పది మంది కుటుంబ సభ్యులు వచ్చారు. సమీపంలోని గోదావరి నదిలో స్నానం చేసిన అనంతరం దైవదర్శనం చేసుకోవాలని గోదావరిలోకి దిగారు. ఈ క్రమంలో అల్లంశెట్టి నాగమణి (45), ఆమె కుమారుడు తేజా శ్రీనివాస్ (23) ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. వీరిని రక్షించేందుకు నాగమణి భర్త, ఇతర బంధువులు ప్రయత్నాలు చేసినప్పటికి అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో క్షణాల్లోనే నదిలో మునిగి గల్లంతయ్యారు. ఈ విషయాన్ని బంధువులు కట్కూరు గ్రామస్థులకు తెలపడంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని నదిలో గాలించినప్పటికీ గల్లంతైనవారి ఆచూకీ లభించలేదు.సమాచారం అందుకున్న వేలేరుపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీహరి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్థానికంగా ఉన్న చేపల బోట్లు, గజ ఈతగాళ్ళతో నదిలో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రానికి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తల్లీకుమారుడి మృతితో బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. నాగమణి దంపతులు అశ్వారావుపేటలో జ్యూస్ బండి నిర్వహిస్తుండగా కుమారుడు శ్రీనివాస్ స్థానిక ఓ దుకాణంలో పని చేస్తున్నాడు.

జల్లేరులో గల్లంతైన యువకుడి మృతి

బుట్టాయగూడెం, జూన్ 10 : బుట్టాయగూడెం మండలం జల్లేరు జలాశయంలో కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన కడారి దుర్గా సాయికుమార్ ఆదివారం చీకటిపడిన తర్వాత గల్లంతవగా అతని మృత దేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు బయటకు తీశారు. దుర్గాసాయి కుమార్ ఏడుగురు స్నేహితులతో కలిసి ఆదివారం గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లాడు. దర్శనం తర్వాత ఇంటికి వెళుతూ దొరమామిడి డ్యామ్‌లో స్నానం చేయడానికి జలాశయంలోకి దిగాడు. ఈత రాకపోవడంతో జలాశయంలో గల్లంతయ్యాడు. చీకటి పడేవరకు స్నేహితులు ప్రయత్నాలు చేసినా ఆచూకీ లభించ లేదు. దీంతో మృతుని తండ్రికి సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికితీశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. హెచ్‌సీ జి.కృష్ణంరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడారి సాయికుమార్ మృతదేహం.. సాయికుమార్ (ఫైల్ ఫోటో)

ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలి



నూజివీడు టౌన్, జూన్ 10: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బిల్డింగ్ ఫండ్ పేరిట ఈ వసూళ్ళు ఉంటున్నాయని, ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నూజివీడు నియోజకవర్గ నాయకులు ప్రవీణ్, ప్రేమ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేయూత



చాట్రాయి, జూన్ 10: మండల విద్యా శాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కంకట బాబూరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో మండలంలోని ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ. 1.76 లక్షలను సోమవారం ఎంఈవో బ్రహ్మచారి చేతుల మీదుగా మృతుడి భార్యకు అందజేశారు. హెచ్ఎంలు కృష్ణయ్య, బక్కయ్య, సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెదుళ్ళ వెంకటేశ్వరరావు, ఆర్. నాగేశ్వరరావు, పెద్ద రమేష్, ఏవీ వెంకటేశ్వరరావు, బి. నాగేశ్వరరావు, ఎస్. రాము, సంజీవకుమార్, దిలీప్ పాల్గొన్నారు.

నాగలింగేశ్వరుడికి వెండి వస్తువుల బహూకరణ



చాట్రాయి, జూన్ 10: మండలంలోని సి. గుడిపాడు నాగలింగేశ్వర స్వామి ఆలయానికి ఎన్టీఆర్ జిల్లా ముష్టికుంటకు చెందిన గద్దె ప్రదీప్, రమ్య దంపతులు సోమవారం రూ. 1.05 లక్షల విలువైన వెండి శఠారి, ఇతర వస్తువులు ఆలయ కమిటీకి అందజేశారు. దాతల పేరిట స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోదండ రాముడి ఆలయానికి విరాళాలు

ఆగిరిపల్లి, జూన్ 10: ఆగిరిపల్లి-విజయవాడ రోడ్డులో గల కోదండ రామాలయానికి స్వామివారి నిత్య దూప, దీప, నైవేద్యాల కోసం ఏర్పాటు చేసిన నిధికి విజయవాడకు చెందిన శ్రీరామ్ వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీరామ్ హరిప్రసాద్, ఆగిరిపల్లి వాస్తవ్యులు శ్రీకాకుళం వెంకట నరసింహారావు కుమారుడు వెంకట నాగేంద్రం రెండు లక్షల రూపాయలు, ధూపగుండ్ల రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం వారి మనువడు యండూరి ప్రణీత్ రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ కార్యదర్శి మడుపల్లి గోపాల్, ఉపాధ్యక్షుడు బెజవాడ ముత్యాలు దాతలను అభినందించారు.

ప్రముఖ న్యాయవాది నారాయణరావు మృతి



నారాయణరావు (ఫైల్)

నూజివీడు టౌన్, జూన్ 10: నూజివీడు పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది నారాయణరావు (70) ఆదివారం రాత్రి మృతి చెందారు. బెంగుళూరులోని బంధువుల ఇంటికి వెళ్ళగా అక్కడ అనారోగ్యానికి గురైన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సందర్భంగా నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్, కార్యదర్శి మధు రవిశంకర్, భారత్ బార్ సెక్రటరీ బావరాజు రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు వైఎస్ దొరై, ఆరీత్య సత్యనారాయణ తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సొసైటీ చైర్మన్ పదవులకు రాజీనామా

ముసునూరు, జూన్ 10: మండల వ్యాప్తంగా ఎనిమిది కో-ఆపరేటివ్ సొసైటీలు ఉండగా సోమవారం మూడు సొసైటీల త్రిసభ్య కమిటీ చైర్మన్లు, సభ్యులు రాజీనామాలు చేశారు. గోపవరం సొసైటీ చైర్మన్ కోటగిరి గోపాలకృష్ణ, కాట్రేనిపాడు చైర్మన్ వై.బాబు రాజేంద్రప్రసాద్, చెక్కపల్లి సొసైటీ చైర్మన్ కాటేపల్లి లింగరావుతో పాటు సభ్యులు రాజీనామాల పత్రాలను నూజివీడు డీఆర్ రవికుమార్‌కు అందజేశారు. రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెందడంతో నైతిక బాధ్యత వహిస్తూ నామినేటెడ్ సొసైటీ చైర్మన్ పదవులకు రాజీనామా చేశామన్నారు. ఇంకా ఐదు సొసైటీల త్రిసభ్య కమిటీల సభ్యులు త్వరలో రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

వైసీపీకి పలగాని రాజీనామా

ఆగిరిపల్లి, జూన్ 10: వైసీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు తన పదవికి రాజీనామా చేశారు. మండలంలో వైసీపీ కన్నా టీడీపీకి అధిక మెజారిటీ రావడానికి నైతిక బాధ్యత వహిస్తూ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నానికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలిరావాలి

ఆగిరిపల్లి, జూన్ 10: జగన్‌రెడ్డి ఐదేళ్ళ పాలనలో క్రిస్టియన్ మైనార్టీలు అన్ని విధాలా నష్టపోయారని చంద్రబాబు నాయకత్వంలో ఆ నష్టం నివారిస్తారని తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం సుసైన్ దేవకుమార్ ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి నిలిపివేసిన అన్ని పథకాలు పునరుద్ధరించాలని కోరారు. మంగళవారంనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి క్రిస్టియన్లు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా కోటమ్మ



ఆగిరిపల్లి, జూన్ 10: ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా ఈదులగూడెం మండల పరిషత్ పాఠశాల ఎస్జీటీ కోటమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఆ యూనియన్ మండల అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు అధ్యక్షతన జిల్లాశాఖ పరిశీలకుడు షేక్ అబ్దుల్‌హక్ పర్యవేక్షణలో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో కొవ్వలి కోటమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చరిత్ర సృష్టించిన కూటమి ఫలితాలు : గోపాల్

ముదినేపల్లి, జూన్ 10 : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ఫలితాలు చరిత్ర సృష్టించాయని దక్షిణ భారత కాపు అసోసియేషన్ కార్యదర్శి పండలనేని గోపాల్ పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు శ్రుతి మించి ప్రవర్తించే ఏ పార్టీకైనా గుణపాఠం ఇలాగే ఉంటుందని ఏపీ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వం రాష్ట్రానికి అవసరమని ఏపీ ప్రజలు భావించి దేశం గర్వించదగిన తీర్పు ఇచ్చారని తెలిపారు. కూటమి వాగ్దానాలు అమలు చేయాలని కోరారు.